ప్రజాశక్తి
మంగళవారం 16 ఏప్రిల్ 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు

హోం ఓటింగ్‌కు సర్వే!

- గుంటూరు,పల్నాడు జిల్లాల్లో గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- జాబితాల్లో వయస్సు తేడాఉంటే ధ్రువపత్రంతో దరఖాస్తుకు అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ఇంటి నుంచి ఓటు వేసేందుకు వికలాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధుల గుర్తింపు ప్రక్రియ సోమవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రారంభమైంది. రెండు జిల్లాల పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రం అధికారులు (బిఎల్‌వో) ఓటర్ల జాబితా ఆధారంగా వీరిని గుర్తిస్తున్నారు. హోం ఓటర్ల గుర్తింపు కోసం బిఎల్‌వోలు వారి వద్ద ఉన్న సమాచారంతో సంబంధిత అర్హుల చేత దరఖాస్తు చేయిస్తారు. ఈ వివరాలను తహశీల్దార్ సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు. ఈ మేరకు వారికి అవగాహన కల్పిస్తారు. 18వ తేదీనుంచి 20వ తేదీ వరకు తిరిగి సంబంధిత దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. అధికారులు ధృవీకరించిన తరువాత అర్హత ఉన్న వారికిఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు.

40 శాతం పైబడిన వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉండి మంచంలో కదలలేని స్థితిలో ఉన్న వారు కూడా హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ ఈనెల 17 వరకు కొనసాగుతుంది. ఒక వేళ ఓటర్ల జాబితాలో వయస్సు తప్పుగా నమోదై వాస్తవంగా ఓటరు వయస్సు 85 దాటినట్టు ఆధార్ కార్డు లేదా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే ఇంటి వద్ద నుంచి ఓటు వేసుకునేందుకు దరఖాస్తు ఫారం 12 డిని సమర్పించవచ్చునని అధికారులు తెలిపారు. వికలాంగులకు 40 శాతం వైకల్యం ఉన్నట్టు సదరం ▶ 2లో

చెరువుకు నీటికోసం రాస్తారోకో

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో తాగునీటి కష్టాలతో ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడుకు సాగర్ నుండి వదిలిన నీళ్ల చెరువులకు చేరాయి. నీరొచ్చిందని సంతోషంతో ప్రత్తిపాడు ప్రజలు చెరువు వద్దకు చేరుకునిలోపే సరఫరా ఆగిపోవడంతో వారిలో ఆగ్రహం పెల్లుబుకింది. పార్టీలకతీతంగా సోమవారం స్థానిక పాతమల్లాయిపాలెం రోడ్డుపై మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించి ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ రాస్తారోకో చేపట్టారు. ఎంపిడిఒ దుర్గాప్రసాద్ వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన కొనసాగించారు. చెరువు నిండకుండానే నీటి సరఫరాను ఎందుకు నిలిపేశారని నిలదీశారు. ఇరిగేషన్ ఇఇ మూరళిధర్ వచ్చి వారితో మాట్లాడారు. రెండ్రోజుల్లో చెరువుకు నీరిస్తామని హామీతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఇచ్చిన మాట ప్రకారం చెరువును నింపకుంటే మళ్లీ ధర్నా చేస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా అన్ని గ్రామాల చెరువులు నిండే వరకూ నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్‌కు టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బి.రామాంజనేయులు లేఖ రాశారు.

ఎన్నికల శిక్షణకు హాజరుకాని వారికి షోకాజులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల విధుల నిర్వహణకు నియమించిన 4600 మంది పోలింగ్ అధికారులకుగాను సోమవారం మొదటి విడతగా 2300 మందికి అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో శిక్షణిచ్చారు. ఈ శిక్షణకు హాజరవ్వని 45 మందికి షోకాజు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న వారు 24 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు హాజరుకాని వారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

5లో

తాడేపల్లిలో శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్న సిపిఎం, సిపిఐ అభ్యర్థులు

ప్రమాదకర బిజెపి కూటమిని, వైసిపిని ఓడించాలి

211 పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సిసి కెమెరాలు

19న నామినేషన్ దాఖలుకు టిడిపి, వైసిపి అభ్యర్థులకు అనుమతి

ర్యాలీలకు అనుమతి లేదు : ఆర్‌ఓ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలో 211 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయి సిసి కెమోరాల పర్యవేక్షణ ఉంటుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాదు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతి, భద్రతలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. మంచికల్లు, తుమృకోట గ్రామాల్లో ఇటీవల జరిగిన ఘటనల్లో ▶ 2లో

హోం ఓటింగ్‌కు సర్వే!

(మొదటి పేజీ తరువాయి)

ధ్రువీకరణ పత్రాలను చూపాలి. ఆరోగ్య సమస్యలుండి మంచంలో ఉన్న వారికి కూడా సంబంధిత వైద్యుల ద్వారా ధ్రువీకరణ పత్రం అందచేయాలి. ఇందుకోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు చేశారు. ఏయే నియోజకవర్గాల్లో ఎంత మంది హోం ఓటింగ్‌కు అర్హులు ఉన్నారు. ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో సంబంధిత బిఎల్‌ఓల నుంచి వివరాలను కంట్రోలు రూమ్ సిబ్బంది సేకరించి రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఎన్నికల కమిషన్‌కు పంపుతారు.

బిఎల్‌వోలుగా ఉన్న సచివాలయం ఉద్యోగులు ఈ ప్రక్రియను మూడురోజుల్లో పూర్తి చేయాల్సి ఉండటంతో సోమవారం ఉదయం నుంచి ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. ఓటర్ల జాబితాల్లో వయస్సు తప్పుగా నమోదైన వారు, 40 శాతం పైబడిన వికలాంగులు నేరుగా సంబంధిత బిఎల్‌వోకు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. పోలింగ్ రోజున ఎన్నికల విధుల్లో పాల్గొనే జర్నలిస్టులకు కూడా ఈసారి పోస్టల్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించారు. ఇప్పటివరకు పోలింగ్ విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులకు ఈ సదుపాయం ఉంది. ఈ సారి జర్నలిస్టులకు, ఇతర శాఖలకు సంబంధించిన వారికి కూడా పోస్టల్ ఓటింగ్ సదుపాయం కల్పించారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే జర్నలిస్టులకు ఎన్నికల కమిషన్ ఇచ్చే ఆథరైజేషన్ లేఖలతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని అధికారులు తెలిపారు.

211 పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సిసి కెమెరాలు

(మొదటి పేజీ తరువాయి)

కేసులు నమోదుతోపాటు పలువుర్ని ఆరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ నెల 18 నుండి నామినేషన్స్ ప్రక్రియ ప్రారంభం ఆవుతుండగా 19వ తేదిన టిడిపి, వైసిపి పార్టీల అభ్యర్థులు నామినేషన్స్ వేసేందుకు అనుమతి కోరినట్లు తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణ దృష్ట్యా ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లకు ర్యాలీలకు వస్తే సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. ర్యాలీలకు అనుమతిచ్చే అవకాశం ఉండదని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అదనపు బలగాలను కోరినట్లు తెలిపారు.

తాగునీటి కంటే మద్యం సులువుగా దొరకుతోంది : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

తాగునీటి కంటే మద్యం సులువుగా దొరికేలా చేసిన దిక్కుమాలిన ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు విమర్శించారు. తాగుబోతు పాలకుడిని సాగనంపితేనే రాష్ట్రాన్ని తిరిగి చక్కదిద్దుకోగలమన్నారు. మండలంలోని ఉప్పరపాలెంలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. మద్యం ద్వారా 30 వేల మందికి పైగా ప్రాణాలు తీసిన రాబందులు చిన్నరాయి దెబ్బకు అల్లాడిపోతుండడం అశ్చర్యమన్నారు. రాష్ట్రం మొత్తం వైసిపి ఎమ్మెల్యేల దోపిడీ ఏ స్థాయిలో ఉందో వినుకొండ స్వాతిముత్యం బొల్లా బ్రహ్మనాయుడు ఒక్కడి ఉదాహరణ చూపిస్తే సరిపోతుందన్నారు. బ్రహ్మనాయుడు ఎమ్మెల్యే అయ్యాక బెల్ట్‌షాపుల్లో కమీషన్లు లెక్క పెట్టుకోవడం తప్ప తాగు, సాగునీటి అవసరాలపై దృష్టి పెట్టింది లేదనానరు. కనీసం సైడ్ కాల్వలు కట్టిన పాపాన పోలేదన్నారు. తాము గెలిస్తే దొండపాడు చెరువుకు ప్రధాన కాల్వ నుంచి నీరు తీసుకొస్తామని, పంట పొలాలకు నీరందిస్తామని చెప్పారు. వరికెపూడిసెల, వాటర్‌గ్రిడ్ పూర్తి చేస్తామన్నారు.

ఎన్నికల ప్రచారంలో వైద్యులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టెన్షన్ కావాలా సమయానికి పెన్షన్ కావాలో? వాలంటీర్ కావాలో? వేధించే జన్మభూమి కమిటీలు కావాలో? తేల్చుకొని ఓటేయాలని మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణంలోని కాకుమాను బజారులో సోమవారం వైసిపికి చెందిన కొందరు పట్టణ వైద్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాల వివరించారు. డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు పేరిట సంక్షేమం అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పని చేస్తున్న వైసిపిని ఆదరించాలన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వ ప్రోత్సహంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సూచన మేరకు ఎన్నో సహాయ కార్యక్రమాలు చేపట్టామన్నారు. గతంలో ఎన్నడూ లేని సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేసిన ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికలలో ఎంపి అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. పాలకులకు అధికారమే లక్ష్యం, సంపాదనే ధ్యేయంగా టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలు పని చేశాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఓరుగంటి శేషిరెడ్డి, పి.వంశీనాథ్‌రెడ్డి, పేరం రాజనందరెడ్డి, సూరా ప్రదీప్ కుమార్‌రెడ్డి, వై.నవీన్, జి.జయభరత్‌రెడ్డి, వేద హాస్పిటల్ అధినేత డాక్టర్ నవులూరి క్రాంతి కుమార్‌రెడ్డి, డాక్టర్ వసంతరాయ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పిఆర్‌కె కోసం కోసం తల్లి, చెల్లి ప్రచారం

ప్రజాశక్తి - కారంపూడి

వైసిపి తరుపున మాచర్ల ఎమ్మెల్యేగా మరోసారి పోటీ చేస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విజయం కోసం ఒకవైపు తల్లి, మరోవైపు చెల్లి ప్రచారాన్ని చేపట్టారు. కాచవరంలో సోమవారం పిఆర్కే తల్లి రాములమ్మ, సోదరి నాగమణి ఎన్నికల ప్రచారం చేశారు. ముందుగా కాచవరం చేరుకున్న వారికి వైసిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైసిపి ప్రభుత్వం మళ్లీ రావాలన్నారు. సిఎంగా జగన్‌ను, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. ఎంపిపి బి.సావిత్రి అల్లయ్య, నాయకులు డి.సాంబిరెడ్డి, జె.నాగిరెడ్డి, కె.అంకిరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, రమణ, లక్ష్మయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని 14వ వార్డులో పిఆర్‌కె తల్లి, సోదరితోపాటు భార్య రమా ప్రచారం చేపట్టారు. పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి గెలిపించాలని కోరారు.

మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద నగదు బదిలీ చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సిఎంని చేసేందుకు పేదలు వైసిపిలో చేరుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చింతలతండాకు చెందిన 50 కుటుంబాల వారు, పట్టణానికి చెందిన 15 మైనారిటీ కుటుంబాలు సోమవారం పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి సమక్షంలో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బూడిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే గ్రామ సమస్యలన్నీ పరిష్కారం : కన్నా

ప్రజాశక్తి-ముప్పాళ్ల

గ్రామంలోని సమస్యలన్నింటిని పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తాననీ టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున సత్తైనపల్లి ఎమ్మెల్యే మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. మండలంలోని లంకెలకూరపాడులో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి ఓట్లు అభ్యర్థించారు. ఐదేళ్ల జగన్ పాలనకు ప్రజలు విసుగెత్తిపోయారని, కూటమీ ప్రభుత్వమే ఈసారి గెలుస్తుందని చెప్పారు. మీరందరూ కలిసికట్టుగా పనిచేసే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని, సత్తెనపల్లి ఎమ్మెల్యేగా తనను, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలను గెలిపించాలని కోరారు. నాయకులు బి.నాగేశ్వరరావు, ఆర్.మధుబాబు, కె.రవీంద్రరెడ్డి, ఎన్.శివ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, షేక్ కాశీం, మాబుసుభాని, కె.జార్జ్, మనోజ్, లీలాఫర్ పాల్గొన్నారు.

వైసిపిలోకి డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వరరావు సోమవారం వైసిపిలో చేరారు. ఆయనకు ఎంపి అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గోపిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ కొండపల్లి సేవలను వైసిపి వినియోగించుకుంటుందన్నారు. నియోజకవర్గంలోని డాక్టర్లు, ఆర్‌ఎంపీలు వైసిపికి అనుకూలంగా ఉన్నారని, వైసిపి మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భార్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భార్య డాక్టర్ సుస్మిత అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని 22 వార్డులో సోమవారం ఆమె ఎన్నికలు ప్రచారం చేశారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆలోచించిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక జతకట్టిన ఎన్డీఏ కూటమికి ప్రజలే తగిన బుద్ది చెప్పాలన్నారు. జగన్ సిఎం అయ్యాక గ్రామాలకు సిమెంట్ రోడ్లు, తారురోడ్లు వేశారని, ఫించన్లు ఒకటో తేదీనే ఇంటికొచ్చి ఇచ్చారని చెప్పారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే పాలన అందించారన్నారు. పేదలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా వర్తించేలా ఆరోగ్యశ్రీ బలోపేతం చేశారని, వైసిపిని మరోసారి గెలిపించాలని కోరారు.

16వ వార్డులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుటుంబీకుల ప్రచారం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని 16వ వార్డులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోడలైన స్వప్న సోమవారం ఎన్నికల ప్రకారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వినుకొండ అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బ్రహ్మనాయుడు ఎమ్మెల్యేగా గెలవాలని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్‌నూ గెలిపించాలన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యదర్శులుగా అంజయ్య, రామాంజనేయరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల : టిడిపి రాష్ట్ర కార్యదర్శులుగా పంగులూరి అంజయ్య, రామాంజనేయరెడ్డిలను నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చంనాయుడు ఉత్తర్వులు జారి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రాష్ట్ర పార్టీలో అవకాశం కల్పించిన అధినేతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కొలకలూరులో ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

ప్రజాశక్తి-తెనాలి

మండల పరిధిలోని కొలకలూరులో ఈనెల 13న ప్రారంభమైన కొత్త ఐజక్‌శ్యామ్ మెయోరియల్ బ్యాట్మింటన్ టోర్నీ మంగళవారం ముగిసింది. గ్రామానికి చెందిన కొత్త ఐజక్‌శ్యామ్ బ్యాంట్మిటన్ అసోసియేషన్(కిస్బా)ఆధ్వర్యంలో కొలకలూరు, నందివెలుగు, ఈమని, ఎరుకలపూడి, కఠెవరం ఐదు గ్రామాల స్థాయిలో వెటరన్ డబుల్స్, మెన్ డబుల్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 20 టీములు పాల్గొన్నాయి. మెన్ డబుల్స్‌లో విన్నర్స్‌గా శ్రీకాంత్, అలోక్, రన్నర్స్‌గా వేణు, విజ్ఞాన్, వెటరన్ డబుల్స్‌లో విన్నర్స్‌గా వినయ్‌కుమార్, కరిముల్లా, రన్నర్స్‌గా రాంబాబు, జెర్మియా నిలిచారు. ఈ సందర్భంగా కిస్బా ఉపాధ్యక్షులు పి.రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్యఅతిధిగా వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారుడు కరింశెట్టి సుబ్బారావు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యాదాత పొన్నెకంటి వెంజిమెన్ ఏర్పాటు చేసిన విద్యాసంస్థలో పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా, క్రీడాకారుడిగా క్రీడలను ప్రోత్సహించిన కొత్త ఐజక్‌శ్యామ్ పేరిట సంస్థ ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. విశిష్ఠఅతిధిగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు తన్నీరు సుబ్బారావు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. కిస్బా అధ్యక్షులు టి.రవీంద్రబాబు, న్యాయవాది ఎస్.మురళీధర్, గల్లా సతీష్, క్రీడాకారులను అభినందించారు. పోటీలకు రిఫరీలుగా మహేష్, కె.మోజెస్, ఎస్.అంబేద్కర్ వ్యవహరించారు. కార్యక్రమంలో కిస్బా కోశాధికారి మేకల రమేష్, కొత్త జార్జి థామస్, సిహెచ్ పీటర్‌పాల్, సిహెచ్ నాగరాజు, శివ, సత్యనారాయణ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కిస్బా బృందం

సానుభూతి కోసం జగన్ రాయి డ్రామా

తాడేపల్లి 16వ వార్డు ఇంటింటి ప్రచారంలో పంచుమర్తి అనురాధ

ప్రజాశక్తి - తాడేపల్లి

జగన్‌రెడ్డికి ప్రజావ్యతిరేకత వ్యక్తమవు తుండడంతో సానుభూతి కోసం గులకరాయి డ్రామా ప్రారంభించారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లి పట్టణం 16వ వార్డులో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్ళి సూపర్‌సిక్స్‌పథకాల కరపత్రాలు అందించారు. రానున్న ఎన్నికల్లో నారా లోకేష్‌ను, పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ జగన్‌పై రాయి విసిరిన వాళ్ళను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. 2019లో కోడికత్తి డ్రామా, చిన్నాన్న హత్య, ఒక్క చాన్స్‌ఇవ్వాలంటూ జగన్‌డ్రామాలాడి ప్రజలను మోసగించారన్నారు. విజయవాడ పోలీస్ అధికారులు గత నాలుగున్నర సంవత్సరాల నుంచి జగన్‌కు రైట్ హ్యాండ్‌గా పనిచేస్తున్నారని, వాళ్ళ ఆధ్వర్యంలోనే ఇదంతా జరిగిందంటే వాళ్ళకి వాళ్ళే దాడి చేసుకున్నట్లు కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. నాలుగు రోజులలో సంచలమైన సంఘటన జరుగుతుందని, ఎన్నికల మూడ్‌ను మార్చేస్తుందంటూ వైసీపీ సోషల్‌మీడియా చెప్పిన విధంగానే గులకరాయి సంఘటన జరగడం డ్రామాలో భాగం కాదా అని ప్రశ్నించారు. జగన్‌డ్రామాలను ప్రజలు నమ్మే రోజులు పోయాయని తెలిపారు. దాడి చేసిన వాళ్ళను పట్టుకుంటే పోలీసులు రూ. 2 లక్షలు ఇస్తామని ప్రకటించారు ఎక్కడి నుంచి ఇస్తారో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4 వేల చొప్పున ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడంతో పాటు ఏప్రిల్, మే, జూన్‌ల్లో పింఛన్‌దారులు తీసుకునే రూ.మూడు వేలకు అదనంగా వెయ్యి చొప్పున జూలై నుంచి ఇచ్చే పింఛన్‌లో కలిపి అందిస్తామన్నారు. మహాశక్తి పథకంలో భాగంగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 'ఆడబిడ్డ నిధి' నుం చి 18 ఏళ్ల దాటిన మహిళలందరికీ నెలకు రూ.1500లు, 'తల్లికి వంద నం' పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికీ ఏడాదికి రూ.15 వేలు, 'దీపం' పేరుతో ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తారని తెలిపారు. రాజధాని లేని, అభివృద్ధికి నోచుకోని రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని అన్నారు.

తాడేపల్లి పోలీస్‌స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి - తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మిస్సింగ్ కేసు నమోదయింది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లి కొత్తూరు కు చెందిన వీరభద్ర వెంకట అప్పారెడ్డి సోమవారం కనిపించడం లేదంటూ వారి కుమారుడు నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామని ఆచూకీ తెలిస్తే ఈ సెల్ :8688831355 తెలియజేయగలరని ఎస్సై రమేష్ కోరారు.

CHANGE OF NAME & ADDRESS

I, ANNAPAREDDY SIVAPARVATHI W/o. SRINIVASAREDDY D.No. 3-242, Redlabazar, Near Gandhi bomma. allurivaripalem village, Ikkurru, Narasaraopet, palnadu District, A.P. 522601(Old Name & Address), hereby state that my actual name & address as **ANNAPUREDDY SIVAPARVATHI W/o. SRINIVASAREDDY(late), hindu, aged about 53 years, resident of, Plot No.401, S.N.R Elites Apartment, Reddynagar, Narasaraopet town and mandal, palnadu Distict. 522603 A.P(New Name & Address)**

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిప ల్ జూనియర్ సివిల్ జడ్జీ గారి కోర్టులో

I.A. No.19/2024 and OS No. 3 /2024

Between:

Sri. Nalamala Vijay Kumar ....Plaintiff

Vs

Sri Jarugula Lakshmaiah ….Defendant

To:

ప్రతివాది :

Jarugula Lakshmaiah, S/o Somaiah, Hindu, aged about 65 years, Door No. 9-10-89, Beside Malapalle Church, Veluru Village, Chilakaluripet Madnal, Guntur District, Present Palnadu dt.,

పై నెంబరు OS.No: 3/2024 గల దావాలో మరియు సదరు దావా నందలి ఆర్డర్ 38 రూల్ 5 ఆఫ్ సిపిసి అటాచ్మెంట్ పిటిషన్ లో I.A.No.19/2024లో ప్రతివాది/రెస్పోండెంట్ అయిన మీరు పై కోర్టునుండి అనేక మార్లు నోటీసులు/సమన్లు పంపిననూ మీకు ముట్టక/మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సదరు పై దావాలో నోటీసు /సమన్లు నిమిత్తము శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయటమైనది. వాయిదా 10-05-2024వ తేదీ అయియున్నది. కావున మీరు పై దావా వాయిదా రోజు అనగా ది. 10-05-2024న ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, మీ తరుపు లాయరు గారి ద్వారా గానీ హాజరై మీయొక్క వాదనకు అనుగుణముగా సమాధానము మరి ఏదేని కౌంటర్ లేదా కౌంటర్ క్లైయిమ్ వంటి ఆక్షేపణలను తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షములో దావా తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయటమైనది.

వాయిదా తేది: 10 -05-2024.

ఇట్లు
రావిపాటి వెంకటేశ్వర రావు,
వాది తరపు న్యాయవాది, చిలకలూరిపేట,

నోటీసు

మహారాజ శ్రీ తెనాలి ప్రన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No:182/2022 in OS No:495 /2019

బిట్వీన్:

బత్తుల నాని ..... డి.హెచ్.ఆర్.

మరియు

ముత్తినేని నిర్మలా దేవి .... జె.డి.ఆర్.

టు,

ముత్తినేని నిర్మలా దేవి, భర్త. మల్లిఖార్జునరావు, నివాస డోర్ నెం.1-33, సంగం జాగర్లమూడి గ్రామము, తెనాలి మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు ఇ.పి లో జె.డి.ఆర్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:29-04-2024 న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:29-04-2024

పరిశా రవీంద్ర బాబు,
కరేటి శ్రీనివాస రావు,
చిట్టా శారదా,
డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్స్,
తెనాలి, గుంటూరు జిల్లా.

టిడిపిలో చేరిన దొండపాడు మాజీ సర్పంచ్ కొమ్మినేని శివయ్య

టిడిపిలోకి దొండపాడు మాజీ సర్పంచ్ కొమ్మినేని శివయ్య

ప్రజాశక్తి - తుళ్లూరు : దొండపాడు గ్రామానికి చెందిన వైసిపి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు టిడిపిలో చేరారు. మాజీ సర్పంచ్ కొమ్మినేని శివయ్య ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు టిడిపి జెండా కప్పుకున్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా దొండపాడు వచ్చిన గుంటూరు ఎంపీ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్ర శేఖర్, తాడికొండ అసెంబ్లీ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ సమక్షంలో టిడిపి లో చేరారు.

దుగ్గిరాలలో టిడిపి నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - దుగ్గిరాల : లోకేష్‌ను గెలిపిద్దాం గంజాయిని నిలిపేద్దాం అనే నినాదాలతో మండల కేంద్రం దుగ్గిరాలలో సోమవారం వాక్ ఫర్ లోకేష్ ఓట్ ఫర్ లోకేష్ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక అలీ నగర్ నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయిని బహిరంగంగా అమ్మించి యువతను వ్యసనాల పాలు చేసి జగన్ ప్రభుత్వం వారి జీవితాలను నాశనం చేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర రావు గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా ఇసుక కొరత అధిక ధరలు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలతో పాటు స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. అధ్వానంగా ఉన్న రోడ్లు టిడిపి అధికారంలోకి వస్తేనే బాగుపడతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు మండల పార్టీ అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత గద్దె శ్రీనివాస్ వల్లూరు నరసింహారావు నక్క చిరంజీవి జున్ను ఖాన్ షేక్ ముర్తుజా షేక్ ఉస్మాన్ మహమ్మద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అత్యవసర విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి, ప్రాతూరు, తాడేపల్లి ప్రాంతాలలో ఉదయం 6:30 నుండి 7:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని మంగళగిరి విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు చెంగయ్య

కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - మంగళగిరి

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ కార్మికులు ఐక్యంగా ఉండి సాధించుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. సోమవారం రాత్రి మంగళగిరి సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ పట్టణ అధ్యక్షులు పేరం పూర్ణచంద్రరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎస్.ఎస్. చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు కార్మికులు, ఐక్యంగా పోరాడి పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా సమ్మె కాలం జీతం, సంక్రాంతి కానుక వెయ్యి రూపాయలు, హెల్త్ లెవెల్స్ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, తదితర సమస్యలపై మున్సిపల్ కమిషనర్ గతంలో చర్చించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కార్మికులంత, ఐక్యంతో ఉండి సమస్యల పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం బాలాజీ, కాసిం, కటారి శ్రీనివాసరావు, కురకంటి ఏసు, కటారి ఆంజనేయులు కలవకలు దుర్గ, బంగారు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో మనోహర్ సతీమణి, పెమ్మసాని సోదరి రాజ్యలక్ష్మీ

అభ్యర్థి కుటుంబ సభ్యుల ప్రచారం

ప్రజాశక్తి - తెనాలి

నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున వారి కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. జనసేన, టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థుల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తరపున ఆయన సతీమణి డాక్టర్ మనోహరం, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తరపున ఆయన సోదరి రాజ్యలక్ష్మి పట్టణంలోని 21వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెనాలి నియోజకవర్గం అభివృద్ధి తో పాటు జిల్లా అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అన్నాబత్తుని జయలక్ష్మి, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి ఎంవీ సుబ్బారావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తాలూకా ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్‌లు ఆర్.హుస్సేన్, ఎ.శ్రీనివాసరావు, ఫైర్‌మెన్‌లు కె.శ్రీనివాసరావు, మోహన్‌బాబు, రమణ నాయక్, షేక్ సుభాని డ్రైవర్ ఆపరేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న నియోజకవర్గ ఆర్‌ఓ మురళీకృష్ణ

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల విధులు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ సూచించారు. నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించనున్న 670 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుకు సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షణిచ్చారు. ఈవీఎంలు ఆపరేటింగ్, ఎన్నికల విధులు ఎలా నిర్వర్తించాలి, ఏయే ఫారాలు పూర్తి చేయాలి తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కల్పించారు. తహసిల్దార్ ఉషా, మున్సిపల్ కమిషనర్ కె.షమీ, వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

బుడగల సుబ్బారావుకు 'ఉగాది మహానంది జాతీయ గౌరవ పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని ఘంటసాల కళాపరిషత్, విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు కళాపీఠం, మహానటి సావిత్రి సాంస్కృతిక సేవాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బుడగల సుబ్బారావుకు ఉగాది మహానంది జాతీయ గౌరవ పురస్కారం లభించింది. సాహితీ, కళ, సేవారంగంలో చేసిన సేవలకు గాను ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర విశ్రాంత కలెక్టర్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత, హైదారాబాద్ సీటి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, సంయుక్త సంచాలకులు, సమాచార పౌర సంబంధాల శాఖ, రాష్ట్ర ప్రభుత్వ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు, డాక్టర్ గాయత్రి, సురేష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.అనిల్ కుమార్‌శర్మ, బ్రహ్మశ్రీ అద్దంకి కృష్ణమాచార్యులు సత్కరించారు.

వేలాది మంది కార్మికులు.. చిన్న గదుల్లో ఆస్పత్రి..

- కొద్దిపాటి మందులు, స్వల్ప పరీక్షలతో సరి..
- ఓ మాదిరి వైద్యం అవసరమున్నా విజయవాడకే పరుగు
- ఇఎస్ఐ ప్రీమియం చెల్లిస్తున్నా ప్రైవేటు ఆస్పత్రులకే పరుగు
- కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గణపవరంలో ఇఎస్ఐ డిస్పెన్సరీ కొనసాగుతున్న అద్దె భవనం

వందలాది పరిశ్రమలు, వేలాదిమంది కార్మికులు ఉన్న చిలకలూరిపేట ప్రాంతంలో ఇఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం అందుకు పూనుకోవడం లేదు. 2012 నుండి చిన్నపాటి డిస్పెన్సరీని చిలకలూరిపేటలోని ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట ఓ అద్దె భవనంలోని ఒక భాగంలో నడుపుతున్నారు. దీనికి నెలకు రూ.16 వేలను ప్రస్తుతం అద్దెగా చెల్లిస్తున్నారు. ఇందులో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ వైద్యులు అందుబాటులో ఉంటున్నా మిగతా సమయాల్లో అత్యవసరంగా వైద్యం అవసరం వచ్చినా, ప్రమాదాలకు గురైనా ప్రాథమిక చికిత్సలకూ ఇఎస్ఐ కార్డుదారులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఉన్న డిస్పెన్సరీలోనూ ఒక్క బెడ్డే ఏర్పాటు చేశారు. ల్యాబ్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లూ కరువే. ఈ పరిస్థితుల్లో వైద్య సేవల కోసం విజయవాడకు వెళ్లాల్సి రావడంతో అది ఇబ్బంది అయిన కార్మికులు పట్టణంలోని ప్రైవేటు ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

చిన్నతరహా పరిశ్రమలకు పేరుగాంచిన గణపవరంలో చిన్న పెద్ద పరిశ్రములు 120–150 వరకూ ఉన్నాయి. వీటిల్లో లక్షమంది కార్మికులు పని చేస్తున్నారు. వీరి జీతాల్లో ప్రతినెలా ఇఎస్ఐకు కొంత మొత్తాన్ని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) కింద కేంద్ర ప్రభుత్వం మినహాయించకుంటోంది. కార్మికులకు ప్రమాదాలకు గురైనా, అనారోగ్యం బారిన పడినా వీరికి వైద్యసేవలు అందించాల్సిన ఇఎస్ఐ ఆస్పత్రి మాత్రం చిలకలూరిపేట ప్రాంతంలో లేదు. జిల్లా స్థాయిలో మాచర్ల, చిలకలూరిపేటలో మాత్రమే డిస్పెన్సరీలున్నాయి. ఇక్కడ జ్వరం, తలనొప్పి, బీపీ, షుగర్ వంటి వాటికి పరీక్షలు, మందులు మినహా పెద్ద సౌకర్యాలేమీ లేవు. ఈ డిస్పెన్సరీకి నెలకు సగటున వెయ్యిమంది, ఏడాదికి 12 వేలకుపైగా కార్మికులు వైద్య చికిత్సల కోసం వస్తుంటారు. వీరితోపాటు ప్రతినెలా ప్రమాదాలు, అత్యవసర వైద్యం కోసమూ వచ్చే కార్మికులుంటారు. అయితే ఒంగోలు–విజయవాడ మార్గంలో మార్టూరు, చిలకలూరిపేటలో మాత్రమే డిస్పెన్సరీలున్నాయి. సరైన వైద్యసదుపాయాలు అందించే ఆస్పత్రుల లోటు తీవ్రంగా ఉంది. పని ప్రదేశాలతోపాటు వాహన రాకపోకలు ఎక్కువగా ఉండే ఈ మార్గంలో కార్మికులకు ప్రమాదాలకు గురైతే విజవాడకు వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా డిస్పెన్సరీలో ఒక్క బెడ్ మాత్రమే ఉండడం వల్ల సెలైన్ పెట్టాలన్నా ఒకేసారి ఇద్దరికి పెట్టే వీలు లేదు. కనీసం నాలుగు బెడ్లు ఏర్పాటు చేయాలనే కార్మికుల విన్నపాలనూ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర పరీక్షలు, కిడ్నీ పరీక్షలు చేయడం లేదు. చిన్నపాటి పరీక్షలకైనా విజయవాడకు వెళ్లక తప్పడం లేదు. అంతదూరం వెళ్లలేని వారు సొంత డబ్బులు పెట్టుకుని చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ మొర ఆలకించి ఇఎస్ఐ ఆస్పత్రిని కీలకమైన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా మందులివ్వడంలో గతంతో పోలిస్తే పరిస్థితులు కాస్తంత మెరుగుపడ్డాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ట్రామాకేర్ వసతులతో కూడిన ఇఎస్ఐ ఆస్పత్రి అవసరమని అయితే తాత్కాలికంగా అయినా ల్యాబ్‌ను పూర్తిగా మెరుగుపర్చాలని, అన్ని పరీక్షలూ చేయడానికి పరికరాలు, సిబ్బందిని సమకూర్చాలని అంటున్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

చంద్రబాబుకు దాస్యాన్ని పవన్ మానుకోవాలి : రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

దాస్యం చేయటం కంటే చచ్చిపోవటం మేలు అంటున్న పవన్.. ముందు చంద్రబాబుకు చేస్తున్న బానిసత్వాన్ని మానేయాలని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారం లేకుండా చంద్రబాబు బతకలేరని, అధికారంలోకి రాలేనని తెలిసి ప్రస్తుతం అనేక కుట్రలకు పాల్పడుతున్నారని రాంబాబు ఆరోపించారు. ఈ ఎన్నికల్లో వైసిపి మళ్లీ గెలిస్తే లోకేష్ రాజకీయ భవిష్యత్ ఏమవుతోందోననే ఆందోళన చంద్రబాబులో ఉందని, ఒంటరిగా పోటీ చేస్తే కాపుల ఓట్లు రావని తెలిసి పవన్ కల్యాణ్‌ను జతచేసుకున్నారని అన్నారు. గత ఐదేళ్లలో చంద్రబాబు అధికారంలో లేని కారణంగా ఆయన సామాజిక తరగతికి చెందిన వారు రూ.లక్షల కోట్లు నష్టపోయారునే ఆవేదనలో చంద్రబాబు ఉన్నారని విమర్శించారు. ముఖ్యమంతి జగన్‌పై విజయవాడలో జరిగిన రాళ్లదాడితో రాష్ట్రం నివెవ్వరపోయిందని, జగన్‌పై విసిరిన ప్రతిరాయీ తెలుగు ప్రజల గుండెలపై పడినట్లే అని అన్నారు.

పిడుగురాళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి తరుపున ప్రచారం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఇండియా బ్లాక్ తరుపున తరుపున గురజాల అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తియ్యగుర యలమందరెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం పిడుగురాళ్ల పట్టణంలో కాంగ్రెస్, సిపిఎం శ్రేణులు ప్రచారం చేపట్టాయి. సీతారాంపురం తండా, ప్రజాశక్తినగర్, అంబేద్కర్ కాలనీ, ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, చించాల డొంక తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలిచ్చి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కో–ఆర్డినేటర్ జొన్నలగడ్డ యోహన్, సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాస రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీని రూ.2 లక్షలు అమలు చేస్తామని, ప్రతి మహిళకు రూ.లక్ష ఆదాయం వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. ఉపాధి హామీ కూలిని పెంచుతామన్నారు. ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల కేటాయిస్తామని, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు రూ.4 వేలు చేస్తామని, వికలాంగుల రూ.6 వేలు ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో డి.వెంకటేశ్వర్లు, షేక్ బాబు, రామకృష్ణ, హుస్సేన్, జె.రమణ, ఎస్.లక్ష్మీ, మరియబాబు, యోహాను, వేణు, ఎం.సామ్రాట్ పాల్గొన్నారు.

ఆర్థిక భారాలు మోపుతూ.. విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపిని ఓడించాలి

మార్నింగ్ వాక్ విత్ ఓటర్స్ కార్యాక్రమంలో నరసరావుపేట కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి రాజధాని, పరిశ్రమలు, యువతకు ఉపాధి అవకాశాలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వంటివి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే సాధ్యమవుతాయని ఇండియా బ్లాక్ తరుపున నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్, ఎమ్మెల్యే అభ్యర్థి మహబూబ్ బాషా అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్‌లో గల జిల్లా క్రీడా ప్రాంగణంలో సోమవారం మార్నింగ్ వాక్ విత్ ఓటర్స్ కార్యక్రమంలో వారు పాల్గొని వాకర్లతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్న బిజెపి ప్రభుత్వానికి, బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన, అదే పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వైసిపికి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇసుక ధరలు, ఆస్తి పన్నులు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ, కులాల మధ్య చిచ్చు పెడుతూ ప్రాంతాల మధ్య విద్వేషాలతో రాజకీయాలు చేస్తున్న బిజెపిని ఓడించాలని, ఇండియా బ్లాక్ తరుపున పోటీ చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ప్రమాదకర బిజెపి కూటమిని, వైసిపిని ఓడించాలి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి : సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లి మండలంలో ఇండియా వేదిక బలపరచిన సిపిఎం, సిపిఐ అభ్యర్థులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లి, తాడేపల్లి రూరల్

కుంచనపల్లిలో సోమవారం సిపిఎం సిపిఐ అభ్యర్థుల విస్తృత ప్రచారాన్ని జెండాలు ఊపి ప్రారంభిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

దేశానికి పెనుముప్పుగా మారిన, ప్రమాదకారి బిజెపిని ఓడించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. సోమవారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సిపిఎం మంగళగిరి శాసనసభ అభ్యర్థి జొన్న శివశంకరరావు, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ ఎన్నికల విస్తృత ప్రచార కార్యక్రమం ప్రారంభమైంది. ఈ ప్రచార కార్యక్రమాన్ని సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య జండాను ఊపి ప్రారంభించగా, కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గం ఇంచార్జ్ ఎస్కే సలీం, సిపిఎం తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వర రావు అభ్యర్థులకు పూలమాలలు వేసి, స్వాగతం పలికారు. అభ్యర్థులు జంగాల అజయ్ కుమార్, జొన్న శివశంకరరావు ల వెంట సిపిఎం, సిపిఐ శ్రేణులు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి 10 సంవత్సరాల కాలంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు అనేకసార్లు పెంచి, నిత్యవసర వస్తువుల ధరలు ప్రజలపై బారాలపడే విధంగా పరిపాలన చేశారని ఆయన విమర్శించారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా పరిపాలన సాగిస్తున్న నరేంద్ర మోడీని, బిజెపిని ఇంటికి పంపాలన్నారు. మతోన్మాద బిజెపి ప్రభుత్వం నల్లధనాన్ని వెలికి తీసుకువస్తానని, ప్రజల అకౌంట్లో డబ్బు జమ చేస్తానని,ఎన్నికల వాగ్దానాలలో ప్రజలను నమ్మించి, పెద్ద అవినీతి పార్టీగా అవతరించిందని ఆయన అన్నారు. దేశంలో ఎన్నికల బాండ్ ల అతి పెద్ద కుంభకోణం జరిగిందని అన్నారు. అదేవిధంగా దేశంలో ప్రశ్నించే ఆయా పార్టీల నాయకులను, అభ్యుదయ వాదులపై నరేంద్ర మోడీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి, జై లలో పెడుతుందని అన్నారు. కులాల మధ్య, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ, మత ఉన్మాదాన్ని బిజెపి చూపిస్తుందని అన్నారు. అంతేకాకుండా గుజరాత్ లోను, మణిపూర్ లోను ముస్లింల పైన, మహిళల పైన దాడులు చేయించిన బిజెపి పార్టీకి రానున్న ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు బిజెపి ప్రభుత్వం కారు చౌకగా అమ్ముతుందని ఆయన విమర్శించారు. దేశ సంపదను దోచుకు తింటున్న బిజెపి ప్రభుత్వం రానున్న ఎన్నికలలో 400 సీట్లతో అధికారంలోకి వస్తామని భీరాలు పలుకుతుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి పార్టీని, దాని విధానాలను తిప్పి కొట్టేందుకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి జొన్న శివశంకరరావు కు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపైన, గుంటూరు పార్లమెంట్ జంగాల అజయ్ కుమార్ కు కంకి, కొడవలి గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. సిపిఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని విచ్ఛిన్నం చేసిందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్ లను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. పరిశ్రమలను, పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేసే బిజెపి పార్టీని ఓడించేందుకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. మంగళగిరి నియోజకవర్గ శాసనసభ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులను వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ కే సలీం మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ విధానాలు ప్రజలు వ్యతిరేకిస్తున్నారని రానున్నది ఇండియా కూటమి ప్రభుత్వమేనని ఆయన అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీల పైన, దళితులు, గిరిజనుల పైన దాడులు పెరిగాయని ఆయన అన్నారు. రానున్న ఎన్నికలలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య, సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు బి ముత్యాలరావు, తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి మండల నాయకులు పటాన్ సుభాని, సిపిఐ మంగళగిరి ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో మంగళగిరి అసెంబ్లీకి సిపిఎం తరపున పోటీ చేస్తున్న ఇండియా వేదిక అభ్యర్థి జొన్నా శివశంకరరావు కాంగ్రెస్ నేతలను కలిశారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ నాయకులు ఎస్కె సలీం, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు సామ్యేలు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. మంగళగిరి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ గెలుపునకు కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు గాదె సుబ్బారెడ్డి, జిల్లా కాపు సాధికారత అధ్యక్షులు ఆర్.హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు నరేష్, ఫ్రాన్సిస్, ఎస్.సురేష్, ఎస్ఎస్‌వి భాస్కరరావు పాల్గొన్నారు.

మంగళగిరి అసెంబ్లీకి ఇండియా వేదిక అభ్యర్థిగా సిపిఎం తరపున పోటీ చేస్తున్న జొన్నా శివశంకరరావు, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ గెలుపు కోసం తాడేపల్లిలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్‌టిఆర్ కాలనీ, అమరారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం సాగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, డివి భాస్కరరెడ్డి, డి.యోహాన్, ఐ.ఇస్సాక్, ఫిరోజ్, వై.శ్రీనివాసరావు, కె.మేరి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నులకపేటలోని రామయ్య కాలనీలో నాలుగు ప్రాంతాల్లో జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో వేముల దుర్గారావు, ఎ.శౌరిబర్తులం, బాష పాల్గొని మాట్లాడారు. నులకపేటలోని ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ పాల్గొని మాట్లాడారు. కార్మిక హక్కుల భద్రత కోసం మంగళగిరిలో సిపిఎం, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, వేముల దుర్గారావు, శౌరిబర్తులం పాల్గొన్నారు.

సమ్మె ఒప్పంద జీవోలను విడుదల చేయాలి

తాడేపల్లి జోనల్ కార్యాలయం వద్ద ధర్నాలో ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

మున్సిపల్ కార్మికులతో సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందానికి సంబంధించి జిఒలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జిఒలు విడుదల చేయడంతో పాటు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అధ్యక్షత వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెల్లవారుజామునే పట్టణమంతా శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల జీతాలు 15వ తేదీ వచ్చినా చెల్లించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరారు. కార్మికులకు గ్లౌజులు, కొబ్బరినూనె, యూనిఫారం, చెప్పులు ఇవ్వాలన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు. లేదంటే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. పెంచిన జీతాలను ఈ నెల నుంచే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి, వి.వెంకటేశ్వరరావు, బూరుగ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ చెంగయ్య, వెంగమ్మ, నాగమణి, మరియమ్మ, వేణు, రమణ, శ్యాలమ పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు.

ధర్నాలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఫలితాలు సాధించిన విద్యార్థులతో మురళీకాంత్

ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధనతోనే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - తెనాలి

మారుతున్న విద్యావిధానాలకు అనుగుణంగా అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యా బోధనే ఉత్తమ ఫలితాలకు వేదికైందని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి అన్నారు. ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన విద్యార్థుల వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను కె ఫరియా 972, డి నీలిమ 969, షేక్ గాలిబి 968, కే కీర్తి 957, డి హర్షిత 947, ఏ వెంకట కేశవ్ 918 మార్కులు సాధించారు. అలాగే జూనియర్ ఇంటర్ ఎంపీసీలో470మార్కులకు పి యశస్విని 459, జి ఎల్ ఎస్ హర్షిత నాలుగు 444, కె ఫాతిమా సని 437, కె సైదా వర్మ 416, కె చంద్రహాస్ 409, ఎల్ యోగ పావని 403, కె బాజీ వర్మ 400, సీఈసీ విభాగంలో వి ఝాన్సీ నాగస్వరూప 406 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మురళి కాంత్ జ్ఞాపికలతో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపల్ పి నాగ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న జంగాల అజయ్‌కుమార్, మస్తాన్‌వలి

శారదా కాలనీలో ఇండియా బ్లాక్ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానికి ఇండియా బ్లాక్ తరపున పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్.మస్తాన్‌వలి విజయాన్ని కాంక్షిస్తూ శారదా కాలనీ వెంగళరావు నగర్, సంజీవనయ్య నగర్‌లో ఎలక్షన్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి, నగర కమిటీ సభ్యులు ఎ.కిరణ్‌కుమార్, రావుల అంజిబాబు, కాంగ్రెస్ నాయకులు చిన్నమస్తాన్, బుజ్జి, మౌలాలి, కరీం, భాగ్యరాజు పాల్గొన్నారు.

రైతుల్ని ముంచిన వ్యక్తి ఆర్కే

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :జగన్ చేస్తున్న యాత్ర బస్సుయాత్ర కాదని అది తుస్సు యాత్ర అని టీడీపీ తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావు అన్నారు. సోమవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి టీడీపీ మండల పార్టీ కార్యాలయంలో టిడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరా సుబ్బారావు మాట్లాడుతూ మా నాయకుడు చంద్రబాబు సైతం దాడి ఘటనను ఖండించారని దాడి జరిగిన వెంటనే చంద్రబాబే చేయించాడని వైసీపీ పేటిఎం బ్యాచ్ మాట్లాడటం చాలా బాధాకరమని అన్నారు. జగన్ బస్సు యాత్రకు ఆదరణ లేకపోవటంతో తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. రాజధాని ఇక్కడే ఉంటుందని జగన్ ను నేను ఒప్పిస్తా అని చెప్పి రైతులను ముంచిన వ్యక్తి ఆళ్ల రామకృష్ణారెడ్డి అని విమార్శించారు. అధికారంలో లేకపోయినా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తిరుగుతున్న ఏకైక వ్యక్తి నారా లోకేష్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, తాడేపల్లి మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతిబసు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో ఎలక్షన్లకు చేశాం.. అనే నిర్లక్ష్యం వద్దు..

ఈవీఎంపై వివరిస్తున్న మాస్టర్ ట్రైనర్లు, కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు (పివో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో), సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ అన్నారు. ఎన్నికల సిబ్బందికి తమ విధులపై నియోజకవర్గస్థాయి శిక్షణను జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది తమ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో శిక్షణా కార్యక్రమాలు అత్యంత ముఖ్యమని చెప్పారు. పొరపాట్లకు తావివ్వకుండా విధులను నిర్వర్తించాలని సూచించారు. పిపిటి-హ్యాండ్‌బుక్ పూర్తిగా చదివి అర్థం చేసుకుని, ఈవీఎం మిషన్లలో బాలెట్ యూనిట్, వివి ప్యాడ్, కంట్రోల్ యూనిట్ అనుసంధాన ప్రక్రియ, పోలింగ్ డే రోజు మాక్ పోల్ ప్రక్రియ, ముఖ్యంగా పలుపత్రాలు నింపే విధానం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఇది వరకు ఎన్నో ఎలక్షన్ విధులు చేశాం అనే నిర్లక్ష్యం చూపవద్దని, ప్రతిసారీ ఈసీఐ కొత్త కొత్త మార్గదర్శకాలు రూపొందిస్తోందని చెప్పారు. సందేహాలు ఎదురైతే నోట్ చేసుకుని పై అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రిసైడింగ్ అధికారులు చేయవలసినవి, చేయకూడనివి వివరించారు.

ప్రజాశక్తి - మాచర్ల

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని పిఒలు, ఎపిఒలకు మాచర్ల అసెంబ్లీ ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. స్థానిక ఎస్‌కెబిఆర్ జూనియర్ కాలేజి ఆవరణలో సోమవారం జరిగిన శిక్షణలో జెసి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి విడతల వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇవిఎంలు, వివి ప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు కనక్షన్ నుండి వివిధ ఫారాలు పూరించటం, ఓటింగ్ నిర్వహణ, ఓటింగ్ సందర్భంగా ఎదురయ్యే సమస్యలను వివరించారు. వీరికి శిక్షణ అనంతరం శిక్షణపై పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏఎస్‌టి, వివిటి, ఎకౌంటింగ్ టీమ్స్, ఎఇఒలతో ఎన్నికల వ్యయంపై సమీక్షించి పలు సూచనలు చేశారు. సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు ఇవిఎంలను ఉంచే స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించారు. కమిషనర్ డి.వెంకట దాసు, మాచర్ల తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మాస్టర్ ట్రైనీలు జెవికెఎస్ ప్రసాదు, ఎస్‌విఎస్ నాగరాజు, రామారావు, కేశవరెడ్డి, బాలాజీనాయక్, ఆర్.ప్రసాదు పాల్గొన్నారు.

మాచర్లలో శిక్షణిస్తున్న జెసి శ్యామ్‌ప్రసాద్

చెరువుకు సాగర్ జాలాలపై పరిశీలన

ప్రజాశక్తి - పెదకూరపాడు

చెరువును పరిశీలిస్తున్న ఎంపిడిఒ మల్లీశ్వరి

సాగర్ జిలాల విడుదల నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని తాగునీటి చెరువును ఎంపిడిఒ పి.మల్లీశ్వరి సోమవారం సందర్శించారు. ఇంజిన్ల ద్వారా చెరువుకు నీరు పెట్టడాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ వేసవిలో తాగునీటి కోసం జనం ఇబ్బంది పడకుండా చూడాలని అదికారులు, సిబ్బందిని ఆదేశించారు.

వికలాంగురాలికి వీల్‌చైర్ వితరణ

ప్రజాశక్తి - గురజాల

వీల్‌చైర్‌ను అందిస్తున్న నజీమున్

నడవలేని స్థితిలో ఉన్న షేక్ హ ఫీజా అనే బాలికకు టిడిపి మైనారిటీ నాయకులు సుందరగిరి సత్తార్ జ్ఞాపకార్థం వారి భార్య, మాజీ ఎంపీటీసీ నజీమున్ వీల్ చైర్ వితరణిచ్చారు. కార్యక్రమంలో నజీమున్ కుటుంబీకులు, స్థానికులు పాల్గొన్నారు.

పేట, పశ్చిమలో గెలుపునకు కృషి : రాజేశ్‌నాయుడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



టిడిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన మల్లెల రాజేష్ నాయుడు తొలిసారిగా ఆ పార్టీ కార్యాలయానికి సోమవారం వెళ్లారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గళ్లా మాధవిని కలిశారు. చిలకలూరిపేట, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థుల విజయానికి గట్టిగా కృషి చేస్తానన్నారు. తనను పరిశీలకునిగా నియమించినందుకు చంద్రబాబు, అచ్చెన్నాయుడు, లోకేష్, పత్తిపాటి పుల్లారావకు కృతజ్ఞతలు తెలిపారు. రాజేష్ నాయుడుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

శిక్షణకు ఎంపికైన యువకులతో నిర్వాహకులు

మొబైల్ శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ అభయ ఫౌండేషన్ సహకారంతో మాచర్ల పట్టణంలోని సత్యసాయి ఆరోగ్య కేంద్రం పైన మొబైల్ రిపేర్ శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. 15 మంది నిరుద్యోగ యువకులకు ఉచితంగా శిక్షణిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా అభయ ఫౌండేషన్ డైరెక్టర్ పిఎస్‌ఆర్ మూర్తి హాజరై మాట్లాడారు. శిక్షణతో మంచి జీవనోపాధి పొందాలని సూచించారు. సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ కన్వీనర్ అక్కినేని అనిల్ కుమార్, శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, సత్యసాయి సేవా సంస్థల డిస్టిక్ ఐటి కో-ఆర్డినేటర్ నాగసురేష్ కుమార్, ట్రైనర్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మరో 200 మందికిపైగా వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - దుర్గి

మండలంలోని 87 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖలను ఎంపిడిఒ గుప్తాకు సోమవారం అందజేశారు. మండలంలో మొత్తం 283 మంది వాలంటీర్లకుగాను ఇప్పటివరకు 91 మంది రాజీనామా అందజేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

మండలంలోని రాయవరానికి చెందిన 19 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ మేరకు లేఖలను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సరోజనికి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగాలిచ్చి తమ కుటుంబాలను ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆదుకున్నారన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పటివరకు ప్రజలకు చేరవేసి సేవలందించామన్నారు. ఇకనుండి వైసిపి గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. రాజీనామా చేసినవారిలో శ్రీకాంత్, పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహేష్, పుష్ప, జెన్నిప్రీతి, కర్నాటి ప్రియ, రవీంద్ర, రాజు, సాయికృష్ణ, గాలి శ్రీను, ఉప్పలపాటి శ్రీను, మధు, ప్రవీణ్, రామ్మోహన్, వీరవెంకటేష్, తేజరెడ్డి, రాజేశ్వరి, మణి ఉన్నారు. ఇదిలా ఉండగా మొత్తంగా మండల పరిధిలోని రాయవరం, తాళ్లపల్లి, భైరవునిపాడు, కంభంపాడు, చింతలతండా తదితర గ్రామాల పరిధిలో వాలంటీర్లు 100 మందికి పైగా రాజీనామ చేశారు.

గుండేపల్లిలో పోలీస్ బలగాల కవాతులో రూరల్ సీఐ సుధాకర్,ఎస్ఐ ఫిరోజ్, సిబ్బంది

ఓటర్ల సహకారంతో ప్రశాంత ఎన్నికలు

ప్రజాశక్తి-ఈపూరు

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఓటర్లు సహకరించాలని వినుకొండ రూరల్ సిఐ యు.సుధాకర్‌రావు కోరారు. ఎన్నికల నేథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా కేంద్ర బలగాలతో గుండేపల్లి, బొగ్గరం గ్రామాల్లో సోమవారం పోలీస్ కవాతు నిర్వహించారు. సిఐ సుధాకర్‌రావు మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే స్థానిక పోలీసులు దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయం కోరని స్థాయికి ఎదగాలంటే కూటమిని గెలిపించాలి : బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

ఎవరి పనులు వారు మరోకరి సాయం కోరకుండా చేసుకునే స్థాయికి పౌర సమాజం ఎదగాలంటే రాష్ట్రంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో సోమవారం ఉదయం బ్రహ్మారెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి పనికి నేడు ప్రజలు వారి వెంట వీరి వెంట తిరిగి తిరిగి అలసి పోతున్నారని, ఇటువంటి పోకడ తమ ప్రభుత్వంలో ఉండదని అన్నారు. అవ్వ,తాతలకు వారి ఇంటి వద్దకే ప్రతినెలా రూ.4వేల పింఛనిస్తామన్నారు. దీపం పథకం కింద ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలెండర్లు అర్హులందరికీ ఇస్తామని చెప్పారు. జగన్ ప్రభుత్వం ఆర్‌టిసి బస్సు చార్జీలను 3 సార్లు పెంచితే తాము అధికారంలోకి రాగనే మహిళలందరు ఆర్‌టిసి బస్‌లలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని అన్నారు. వ్యాపారులకు తమ కూటమి పూర్తిగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కె.దుర్గారావు, ఎన్ కేశవరెడ్డి, వై.మల్లికార్జునరావు, ఎన్.ప్రసాద్, ఒ.క్రాంతికుమార్, ఎం.వాసు, పి.క్రిష్ణ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి కజ్జం సైదయ్య, ఆయన అనుచరులైన 15 కుటుంబాలు, రాయవరానికి చెందిన 10 ఎస్‌సి కుటుంబాల వారు బ్రహ్మారెడ్డి సమక్షంలో వైసిపి పార్టీని వీడి టిడిపిలో చేరారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ టిడిపిలో కార్యకర్తలకు తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వారికోసం సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపురిసౌత్‌లోని డౌన్ మార్కెట్‌లో గత ఆదివారం అనారోగ్యంతో మహమ్మద్ అలీ మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాలతో టిడిపి నాయకులు సోమవారం పరామర్శించి రూ.10 వేల సాయం అందించారు. ఎం.అప్పలరాజు, వెంటేశ్వరులు, ఎం.శ్రీను, సిహెచ్ అప్పలరాజు, సిహెచ్.భూలోక, రమేష్ నాయుడు, జి.శ్రీను పాల్గొన్నారు.

రాళ్ల దాడిలో క్షతగాత్రులకు పరామర్శ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని తొండపిలో జరిగిన దాడిలో గాయపడిన టిడిపి కార్యకర్తలను టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటి చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ సోమవారం సత్తెనపల్లిలోని ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. బాధితులకు టిడిపి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాధితులను పరామర్శిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
మంగళవారం 16 ఏప్రిల్ 2024

పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

ఎన్నికల అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గములో ఎన్నికల విధులకు కేటాయించబడిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం మంగళగిరి ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో 8 మంది మాస్టర్ ట్రైనర్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు 317 మంది ప్రిసైడింగ్ అధికారులకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున ఏ విధంగా విధులు నిర్వహణ, ఇవిఎంల ఉపయోగం తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరియు సంయుక్త కలెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించారు. సదరు శిక్షణ కార్యక్రమమునకు డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్ మరియు జిల్లా కలెక్టర్ సందర్శించారు. అనంతరం మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం యొక్క స్ట్రాంగ్ రూములను పరిశీలించి, మంగళగిరి రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయాన్ని కూడా ఆయన సందర్శించారు.

ఉచితంగా కృత్రిమ చేతుల పంపిణీలో

వాకర్స్ అసోసియేషన్ భాగస్వామ్యం

ప్రజాశక్తి - మంగళగిరి

వికలాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులను అందజేసే కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరితో వాకర్స్ అసోసియేషన్ భాగస్వామి అయ్యిందనిరోటరీ క్లబ్ మంగళగిరి కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం అయన మీడియాతో మాట్లాడారు. మే 19 నుండి 26 వరకు మంగళగిరి విటిజెఎం మరియు ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో వికలాంగులు పనిచేసుకోవడానికి అనువైన సిరామిక్ కృత్రిమ చేతులను ఉచితంగా అందజేసే శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు సమాచారాన్ని లబ్దిదారులకు విస్తృతంగా చేరవేయడానికి వాకర్స్ వెల్ఫేర్, నేచర్ వాకర్స్ అసోసియేషన్‌లతో కలసి పని చేయాలని వారితో ఎకో పార్కులో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. పూర్తిగా కాని, పాక్షికంగా గాని వికలాంగులు కృత్రిక చేతులు కొరకు రోటరీ హెల్ప్‌లైన్ నంబరు 720 740 3150 కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఛైర్మన్ అనిల్ చక్రవర్తి , వాకర్స్ అసోసియేషన్ల సభ్యులు, కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వర రావు, డైరెక్టర్లు అందె మురళి మోహన్, పారేపల్లి నిరంజన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమరవాణా పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు : మండలంలోని వెలవర్తిపాడులో సోమవారం మై ఛాయిస్ ఫౌండేషన్, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షత గ్రామజ్యోతి కార్యక్రమం జరిగింది. వెలవర్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, గృహహింస మూడు విషయాల మీద ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు మానవ అక్రమ రవాణా గృహహింస ఈ మూడు లేని గ్రామాలే సురక్షిత గ్రామాలు అని పేర్కొనటం జరిగింది. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ సైదా వలి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సమాజంలో జరిగే మానవ అక్రమ రవాణా గురించి అవగాహన కలిగి, ఒక క్రమశిక్షణతో జీవిత లక్ష్యాలను అధిగమించాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ కే బాజీ, బి వెంకటేశ్వర్లు మహిళా పోలీసు ఎస్ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నాటిక ఆహ్వాన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నేడు తెలుగు నాటకరంగ దినోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సమాతా ఆర్ట్స్ థియేటర్, ప్రజ్వలిత, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు నాటకరంగ దినోత్సవ వేడుకలను కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు నటులు ఎం రామలింగేశ్వరరావు తెలిపారు. స్థానిక టాలెంట్ ఎక్స్ ప్రెస్ కార్యాలయంలో సోమవారం మీడియాతో వారు మాట్లాడారు. ముందుగా "అనితరుడు" పుస్తక పరిచయ సభ జరుగుతుందని తెలిపారు. అనంతరం తెలుగు నాటక రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా సంచనాలు సృష్టించిన సమత ఆర్ట్స్ థియేటర్ 45వ వార్షికోత్సవం సందర్భంగా 'ముట్టడి' లో నటించిన నటీ నటులు, సాంకేతిక నిపుణులకు ఆత్మీయ సత్కారం జరుగుతుందని తెలుగు నాటకరంగం అధ్యక్షులు కనపర్తి బాబూరావు తెలిపారు. అనంతరం ముట్టడి నాటక రచయిత పి. ప్రకాష్ రచన, దర్శకత్వం వహిస్తున్న "మానవ రాజ్యంలో" అనే సాంఘిక నాటిక ప్రదర్శిస్తున్నట్లు తెలియజేసారు.

సంక్షేమ పథకాలతో పేదరికం పోదు

తుళ్లూరు మండలంలో పెమ్మసాని ప్రచారం

ప్రజాశక్తి - తుళ్లూరు :అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేవలం సంక్షేమ పథకాల అమలుతోనే పేదరికం పోదని గుంటూరు పార్లమెంట్ స్థానానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం తాడికొండ అసెంబ్లీ నియోజక వర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్, బిజెపి, జనసేన నాయకులతో కలిసి పెమ్మసాని మండలంలో రోడ్ షో నిర్వహించారు. పెద పరిమి, నెక్కల్లు, అనంతవరం, వడ్డమాను, హరిశ్చంద్ర పురం, బోరుపాలెం, దొండపాడు గ్రామాల్లో రోడ్డుషో నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్ధించారు. జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చే ఐదు, పది వేల రూపాయలతో జీవితాలలో మార్పు రాదని, ఉపాధి అవకాశాలు లభించి రోజుకు రూ వెయ్యి, రూ1500లు సంపాదన లభించడం ద్వారా మాత్రమే పేదరికం నుంచి బయట పడగలరని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు టిడిపి వ్యతిరేకం కాదని, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం టిడిపి లక్ష్యమన్నారు. రైతు దీక్షా శిబిరాల వద్దకు వెళ్లి రైతులను పలుకరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనేకుల సుబ్బారావు, నూతలపాటి రామరావు, పుట్టి రామచంద్రరావు, మారధాని గుర్నాథం, రైతు జెఏసి నాయకులు పువ్వాడ సుధాకరరావు, జనసేన,బిజెపి నాయ కులు యర్రగోపు నాగరాజు,కంతేటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నెక్కల్లు రైతు దీక్షా శిబిరంలో రైతులతో పెమ్మసాని తదితరులు

మంగళగిరిలో రాజీనామా చేసిన వాలంటీర్లు

కొనసాగుతున్న వాలంటీర్ల రాజీనామాల పర్వం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణ పరిధిలోని 27 మంది వాలంటీర్స్ సోమవారం తమ రాజీనామాలను మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలో అందచేశారు. మంగళగిరి పట్టణ పరిదిలోని 29 వ వార్డు, 18 వ సచివాలయ పరిధిలోని 15 మంది వాలంటీర్స్, పట్టణ పరిధిలోని పలు సచివాలయల నుంచి 12మంది వాలంటీర్ లు రాజీనామ అందచేశారు. ప్రభుత్వ తమను ఏ ఉద్దేశంతో నియమించిందో ఆ వృత్తిలో న్యాయం చేయలేక స స్వచ్ఛందంగా రాజీనామా చేయటం జరిగిందని వాలంటీర్ లు తెలియజేశారు. తాము ఇకపై స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేయటానికి కృషి చేస్తామని, తమను రాజకీయంగా విమర్శలు చేయటంపై కొంత అవేదనతో రాజీనామా చేయాల్సి వచ్చిందని వారు అన్నారు.

కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

అభివృద్ధికి ఓటెయ్యండి : నాదెండ్ల

ప్రజాశక్తి - తెనాలి

సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. టిడిపి జనసేన బిజెపి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పట్టణంలోని 19, 20 వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెనాలిలో తాను చేసిన అభివృద్ధిని వివరించి కూటమిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్ దేశు యుగంధర్, అమ్మిశెట్టి హరికృష్ణ, షేక్ కాలేషా, హరిదాసు గౌరీ శంకర్, జాకీర్ హుస్సేన్ ఉన్నారు.

వైసిపి అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రచారం

పాత మంగళగిరిలో లావణ్య ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి పట్టణంలోని పాత మంగళగిరి దళితవాడలో సోమవారం వైఎస్ఆర్సిపి మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్ఆర్సిపి నాయకులు కొల్లి నరేష్, కే అనుపమ, మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో ధూళిపాళ్ల నరేంద్ర ప్రచారం

సమస్యలను పరిష్కరిస్తా : ధూళిపాళ్ల

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పట్టణంలోని 4,5 వార్డులలో తెలుగుదేశం, జనసేన, బిజెపి ప్రకటించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ 6 లోని సంక్షేమ పథకాల గురించి సోమవారం టిడిపి అసెంబ్లీ అభ్యర్థి నరేంద్ర కుమార్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. వార్డుల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ధూళిపాళ్ళ మాట్లాడుతూ ప్రజలహితమే అభిమతంగా పెట్టుకుని పని చేస్తానని చెప్పారు. అధికారంలోకి రాగానే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని వార్డులోని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటిమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నవరంగ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ జలీల్

బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలి

నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి :రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను రద్దుచేసి, బ్యాలెట్ ద్వారా ఎన్నికల నిర్వహించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ జలీల్ అన్నారు. సోమవారం మంగళగిరి ప్రెస్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. నరేంద్ర మోడీ బిజెపికి 400 సీట్లు వస్తాయని చెప్పడంలో ఆంతర్యం ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి గెలవాలని ఉద్దేశం ఉన్నట్లుగా తెలిపారు. అందువలన ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంగళగిరిలో నవరం కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నా నని చెప్పారు. వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యకు, టిడిపి అభ్యర్థి నారా లోకేష్‌కు ఓటు వేసిన ఉపయోగముండదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ సైదా, సయ్యద్ ఖమురున్నిస, షేక్ బాషా, సయ్యద్ రిజ్వానా, పి సాంబశివరావు, షేక్ గబ్బర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై డెమో

ప్రజాశక్తి - తెనాలి :అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రమాదాలు నియంత్రణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి కె కృష్ణారెడ్డి సారథ్యంలో ఫైర్ స్టేషన్ నుంచి బయలుదేరి గాంధీ చౌక్ మెయిన్ రోడ్డు మీదుగా రైల్వే స్టేషన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అగ్ని ప్రమాదాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా కష్ణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 14న వారోత్సవాలు ప్రారంభ మయ్యాయన్నారు. అపార్ట్మెంట్లు, హోటల్స్, వంట గదుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలు, వాటిని నియంత్రించే విధానాన్ని, ప్రమాద సమయంలో తీసు కోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించామని, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలని కోరామన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం మంగళగిరి పట్టణ ఫైర్ స్టేషన్ అధికారులు సిబ్బంది అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొను టపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ బస్ స్టాండ్ సినిమా థియేటర్లు నివాస సముదాయాలు అపార్ట్మెంట్లు మొదలగు ప్రాంతాలలో పర్యటించి సోమ వారం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంగళగిరి ఫైర్ ఆఫీసర్ వై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అపార్ట్మెంట్లలో హాస్పటల్ మరియు ఇతర ప్రదేశాలలో అగ్ని

ప్రమాదాలు సంభవించినప్పుడు త్వరిత గతిన అందుబాటులో ఉన్న వస్తువులతో మంటలను అదుపు చేయాలని లేనియెడల పెను ప్రమాదం జరగ వచ్చని ప్రజలకు సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అగ్నిమాపక కేంద్రాలయానికి 101 గాని లేక మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఫైర్ స్టేషన్ 086 45232999 నెంబర్‌లను వినియోగించు కోవాలన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందు మాధవ్

సార్వత్రిక ఎన్నికలు -2024 దృష్ట్యా ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేశామని పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, సాధారణ అనే విధంగా విభజించామని దానికి తగ్గట్టు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా రొంపిచర్ల మండలం అలవాల, గోగులపాడు, నరసరావుపేట మండలం ఉప్పలపాడు, యలమంద, రావిపాడు గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సోమ వారం సందర్శించి అక్కడ భద్రతా ఏర్పాట్లు గురించి పోలీసు అధికారులకు సూచించారు. అదే విధంగా అక్కడ ప్రజలతో మాట్లాడారు. ప్రజలకు ఎన్నికల నియమావళిని గురించి వివరించి ప్రజలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘున జరిగినట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసరావుపేట డిఎస్పి విఎస్ఎన్ వర్మ, నరసారావుపేట రూరల్ సిఐ మల్లికార్జున, రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ ఎస్ఐలు సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

జిఎంసి పరిధిలో పిఒ, ఎపిఒలకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఎన్నికల విధులపై అందిస్తున్న శిక్షణను శ్రద్ధగా అవగాహన చేసుకుంటే పోలింగ్ సాఫీగా నిర్వహించడానికి వీలు కలుగుతుందని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులు కేటాయించబడిన పిఓలు, ఏపిఓలకు సోమవారం స్థానిక ఏసి కళాశాలలో జరుగుతున్న తొలివిడత శిక్షణను కమిషనర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పిఓలు, ఏపిఓలుగా విధులు కేటాయించబడిన వారికి ఏసి కాలేజిలో తొలివిడత శిక్షణ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల విధులపై సీనియర్ మాస్టర్ ట్రైనర్ల ద్వారా అందిస్తున్న శిక్షణను విధులు కేటాయించబడిన అధికారులు శ్రద్ధగా అవగాహన చేసుకుంటూ, పోలింగ్ రోజు ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి వీలుకలుగుతుందని తెలిపారు. శిక్షణలో వీడియో క్లిప్పింగులు, డెమో ఈవియంలు, వివి ప్యాట్ కమీషనింగ్, మాక్‌పోల్, ఫారం-17సి, పిఓ డైరీ, ఇతర ఫారాలు నింపడం వంటి కీలక అంశాలు వివరించడం జరుగుతుందన్నారు. అలాగే ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగుల నుండి పోస్టల్ బ్యాలెట్‌కి సంబందించి ఫారం-12ని సిబ్బందికి అందించాలన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఎల్ఈడి స్క్రీన్‌లు, మైక్‌లు తగిన విధంగా ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, ఏఈఆర్ఓ వెంకట లక్ష్మి, డిఈఈ రమేష్‌బాబు, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ఏఈ సునీల్ కుమార్, మేనేజర్ యస్.యన్. ప్రసాద్ పాల్గొన్నారు.

వివిఐటిలో మై డియర్ దొంగ చిత్రం యూనిట్

ప్రజాశక్తి - తెనాలి

మాట్లాడుతున్న అభినవ్ గోమఠం

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరులో సోమవారం 'మై డియర్ దొంగ' చిత్రం యూనిట్ సందడి చేసింది. సర్వజ్ఞ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ఈనెల 19న ఆహా ఓటిటిలో విడుదల కానున్న నేపథ్యంలో హీరో అభినవ్ గోమఠం, శాలిని, శశాంక్, దివ్యశ్రీ పాద చిత్రం ప్రచారం నిమిత్తం కళాశాల కు వచ్చారు. ఈ సందర్భంగా అభినవ్ గోమఠం మాట్లాడుతూ అద్యంతం హాస్యాస్పద సన్నివేశాలతో సాగే చిత్రం టీజర్ కు విశేష స్పందన లభించిందన్నారు. చిత్రం యూనిట్‌తో విద్యార్థులు సెల్ఫీలు తీసుకుని డాన్సులు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి కవితలు దోహదం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టి.జె.పి.యస్. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి నిర్వహించిన కవితల పోటీలలో విజేతలైన వారికి సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాట్లాడుతూ మన తెలుగు వారి తొలి పండుగైన ఉగాది మనకు నూతన సంవత్సరం అని, చైత్ర మాస ప్రారంభ దశలో ప్రకతిలో వచ్చే నూతన మార్పుల మాదిరిగా మన జీవితాలలో వచ్చే సరికొత్త మార్పులకు స్వాగతం పలుకుతూ, ఆరు రుచుల ఆప్యాయతను కలుపుకుని సుఖ సంతోషాలతో జీవించాలని చెప్పారు. మనసులోని అందమైన బావాలను తెలియజేసే సాహితీ ప్రక్రియ కవిత్వం అని, అధ్యాపకులకు మానసిక వికాసాన్ని కలిగిస్తుందని, కవితలలో పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు విభాగాదిపతి డాక్టర్. జె.వి.సుధీర్‌కుమార్, అధ్యావకురాలు కె.శ్రావణి, డాక్టర్. నిర్మలా రాణి, ఆర్.జయ శైలజ, పి.నాగ మణి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఎన్నికల శిక్షణా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

పజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కలెక్టర్

సార్వత్రిక సాధరణ ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాలలో ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు (ఏపీఓ) నిర్వహిస్తున్న మొదటి విడత శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మంగళగిరిలో నిర్మల ఫార్మసీ కళాశాలలో మంగళగిరి రిటర్నింగ్ అధికారి, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారితో కలసి, గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిఎంసి అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మీతో కలసి పరిశీలించారు. పీవోలకు, ఏపీవోలకు అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శిక్షణ పొందుతున్న పీఓలు, ఏపీవోలతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ లక్ష్యమైన జీరో రీపోల్ సాధించాలంటే ఎన్నికల రోజు పోలింగ్‌బూత్‌లలో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పీవోలు, ఏపీవోలు ఎన్నికల తేదికి ఒక రోజు ముందు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఈవీఎం యూనిట్లు, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారాలు పరిశీలించుకోవాల్సిన విధానం, ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాలలో మాక్‌పోలింగ్, యాక్చువల్ పోలింగ్ నిర్వహణకు పాటించాల్సిన మార్గదర్శకాలు, ఇతర ప్రక్రియలపై శిక్షణను ఇవ్వటం జరుగుతుందన్నారు. పీవోలకు, ఏపీవోలకు శిక్షణ కేంద్రాలలో పూర్తిస్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పించటం జరిగిందని, అదే విధంగా పోలింగ్‌రోజు పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు సిద్ధం చేయటం జరిగిందన్నారు. అనంతరం మంగళగిరిలో నిర్మల కాన్వెంట్ ఈవీఎం యూనిట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి, మంగళగిరి రిటర్నింగ్ అధికారి జి.రాజకుమారితో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమనియోజకర్గ ఏఆర్వోలు డీసీపీ ఎన్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్‌కుమార్, మంగళగిరి తహశీల్దారు వేంకటేశ్వర రావు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో హిందూ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

ఇటీవల ప్రకటించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రతిభ చూపిన హిందూ కాలేజి విద్యార్థులను సోమవారం కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఎనిమిది దశాబ్దాలుగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారిని ఉత్తమ పౌరులుగా తిర్చిదిద్దుతున్నామని, విద్యార్థులకు చదువుతోపాటు, క్రమశిక్షణ, ఆటలు వంటి అంశాల్లో కూడా శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లిఖార్జునప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేటు కాలేజిలకు ధీటుగా హిందూ కాలేజి విద్యార్థులకు చక్కటి విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ఎ.మంజుశ్రీ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో టిజెపిఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని చదువుతున్న విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం తెలియ చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం కళాశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సెక్రటరీ మాట్లాడుతూ సామజిక సేవాభావంతో ఏర్పాటు చేసిన తమ కళాశాలలో విద్యార్థులు ఎంతో కష్టపడి కార్పొరేట్ విద్యాసంస్థలకి ఏమాత్రం తీసిపోకుండా అత్యధిక మార్కులు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని, వీరికి పై తరగతులకోసం కళాశాల తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ మేజర్ ఏ.బి.పి.మనోహర్ మాట్లాడుతూ సీనియర్ ఎంపిసిలో పి.గౌస్య నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికి చదువుపై ఉన్న ఇష్టంతో కష్టపడి 1000కి 951 మార్కులు సాధించిందని, యమ్.వి.మహేష్ 919 మార్కులు, సి.ఇ.సి.లో ఏ.వేణు గోపాలస్వామి 938, జూనియర్ ఎంపిసిలో కె.రాజ్ కుమార్ 470కి 406 మార్కులు, మాబు సుభాని 406, సిఇసిలో డి. రవితేజ 500 మార్కులకు 433, కె.రాణి 423 మార్కులు సాధించారన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించారని పేర్కొన్నారు. మంచి మార్కులు తెచ్చుకునే విద్యార్థులకు ఫీజులలో రాయితీ ఇవ్వటమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగాలకు తగిన శిక్షణ ఇస్తామని సెక్రటరీ చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఇంచార్జ్ జి. సురేష్‌కుమార్, డాక్టర్. జె.వి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాతృమరణాలపై సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి తన ఛాంబర్‌లో మాతృమరణాలపై సబ్ డిస్ట్రిక్ లెవల్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మార్చిలో పెదకాకాని, కుంచనపల్లి, ఎర్రబాలెం, ఆరోగ్య కేంద్రాలలో సంభవించిన 3 మాతృమరణాలకు గల కారణాలను కమిటీ సభ్యులు సమీక్షించి అందులో 1 నివారించదగినదిగాను 2 నివారించలేనివిగాను నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ సునీత, డాక్టర్ ఆదిత్య ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ రాధికారాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ అన్నపూర్ణ, కె.శాంతకుమారి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా గెలవలేరు

మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సిఎం జగన్ కు వ్యతిరేకంగా ఎన్ని కుట్రలు పన్నినా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో గెలవలేరని మంత్రి విడదల రజని చెప్పారు. బిజెపి, జనసేన , కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన పలువురు నేతలు ఇటీవల వైసిపిలో చేరారు. వారితో కలసి ఆమె సోమవారం తన కార్యాలయంలో మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి లో చేరిన టీవీరావు, చందు సాంబశివరావు, వి.సుబ్బారావు తదితరులతో కలిసి మంత్రి రజిని మాట్లాడుతూ పేద ప్రజలను బాగా ఆదుకున్న సీఎం జగన్ కు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేక ఆయన పై దాడికి టిడిపి కార్యకర్తలను చంద్ర బాబు నాయుడు తాడికొండ సభ లో రెచ్చగొట్టారని ఆరోపించారు. సమావేశంలో గుంటూరు నగర కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, టీడీపీకి చెందిన సాజిద్ అలీ, దొంతా నాగ గౌడ్ అజయ్ తదితరులు సీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విడదల రజిని